శుక్రవారం
FRIDAY
28.11.2025
సంచిక(ISSUE) : 89
సంపుటి(VOLUME) : 17
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

# ఋషి
ధర్మం కోసం అక్షర తపస్సు    తెలుగు దినపత్రిక


## ముహూర్తం

28 నవంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:32 సూర్యాస్తమయం - సా. 5:36 తిథి అష్టమి రా. 12:10ం వరకు తరువాత నవమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శతభిష రా. 2:37ం వరకు తరువాత పూర్వాభాద్ర యోగం వ్యఘాతా ఉ. 10:57 వరకు కరణం విష్టి మ. 12:24 వరకు బవ రా. 12:10+ వరకు వర్జ్యం ఉ. 9:49 నుండి ఉ. 11:26 వరకు దుర్ముహూర్తం ఉ. 8:45 నుండి ఉ. 9:29 వరకు మ. 12:26 నుండి మ. 1:10 వరకు రాహుకాలం ఉ. 10:41 నుండి మ. 12:04 వరకు యమగండం మ. 2:50 నుండి సా. 4:13 వరకు గుళికాకాలం ఉ. 7:55 నుండి ఉ. 9:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:56 నుండి తె. 5:44 వరకు అమృత ఘడియలు రా. 7:31 నుండి రా. 9:08 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:41 నుండి మ. 12:26 వరకు గమనిక: "+" అనగా మరుసటి రోజున


ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 96667 11515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, rhushinews@gmail.com మెయిల్‌కు బయో డేటా పంపగలరు.



Published From HYDERABAD II www.rhushinews.com    facebook: rhushinews    twitter: rhushinews    instagram: rhushinews


# గెలుపోటములు సహజం

## మళ్లీ గెలుస్తాం.. కెసిఆర్‌ను సిఎంను చేస్తాం

### అసలు యుద్ధం 2028లో ఉంటుంది

### తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం..అధికారంలోకి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఎపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపు నిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ లోకి భారీగా చేరికలు జరిగాయి.



2వ పేజీలో..

### భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా ఉండాలి

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

### స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో కనిపించాలి

### ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించాలి

### సమ్మిట్‌కు ప్రధాని మోదీని ఆహ్వానిస్తున్నాం

### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సీఎం

### రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై సమీక్ష


# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీ



### రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా డాక్యుమెంట్

హైదరాబాద్,నవంబర్27 : పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై

- మిగతా 2వ పేజీలో..



### ఎస్సీ,ఎస్టీలకు మాదిరి

# దివ్యాంగులకు రక్షణ

### కఠిన చట్టాలు అవసరమన్న సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,నవంబర్ 27: దివ్యాంగులకు కూడా రక్షణ కవచం ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. వారినికించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం

- మిగతా 2వ పేజీలో..

# అబద్ధాలకు అంబాసిడర్ కెటిఆర్

### అబద్ధపు ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం

### బిసి రిజర్వేషన్లపై చేస్తున్న వ్యాఖ్యలు సత్యదూరం

### కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన మంత్రి సీతక్క



హైదరాబాద్,నవంబర్ 27: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బిఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు

- మిగతా 2వ పేజీలో..

### రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి

# రాక్షస పాలన

### చట్టాలను బేఖాతరు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

### బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ ఆరోపణలు

రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ చట్టంలోని నిబంధనలను బేఖాతరు చేసి కాంగ్రెస్ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదని.. ప్రజా ప్రతీకార పాలన.. పోలీసు రాజ్యమని మండిపడ్డారు.



హైదరాబాద్,నవంబర్27: సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు మంత్రి సురేఖ ఓఎస్‌డీ సుమంత్ తో కలిసి దక్కన్ సిమెంట్ యజమానులను గన్నుతో బెదిరిస్తే

- మిగతా 2వ పేజీలో..

# యువత వల్లే స్టార్టప్ విప్లవం


## ప్రపంచానికే ఆదర్శం మన యువత

### దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు

### మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్

### ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-X'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.



న్యూఢిల్లీ,నవంబర్ 27: ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని

- మిగతా 2వ పేజీలో..

# కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

### ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ

### రెండు గంటల పాటు కొనసాగిన విచారణ

హైదరాబాద్,నవంబర్27: తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్‌డీ) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ

- మిగతా 2వ పేజీలో..

### సిగాచీ ఫార్మా పేలుడు

# చిన్న ఘటనా?

### 54 మంది చనిపోయిన ఘటన చిన్నదేమీ కాదు

### పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

### నిందితులను గుర్తించకపోవడంపై తీవ్ర అసంతృప్తి

### డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం

హైదరాబాద్,నవంబర్27: సిగాచీ ఫార్మా పరిశ్రమలో 54 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న పేలుడు ఘటనలో పోలీసు దర్యాప్తు తీరును తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇంత పెద్ద దుర్ఘటన జరిగి నెలలు గడుస్తున్నా దర్యాప్తు పూర్తి కాకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం

- మిగతా 2వ పేజీలో..



# 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

### సింగిల్ బెంచ్ ఉత్తర్వులు కొట్టివేత

### ఉత్తర్వులను సస్పెండ్ చేసిన సీజే ధర్మాసనం

### తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా

హైదరాబాద్,నవంబర్ 27: 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సీజే ధర్మాసనం జారీ చేసింది. 2015 గ్రూప్-2

- మిగతా 2వ పేజీలో..



# ఆర్టీసీ బస్సులో నాటుబాంబులు

### బస్సులో 1000 నాటుబాంబుల రవాణా




విజయనగరం,నవంబర్27: అది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉండే బస్టాండ్. ఒక్కసారిగా భారీ శబ్దం. దట్టమైన పొగలు. కారణం, ఆర్టీసీ బస్సులో వచ్చిన ఓ పార్శిల్‌లో ఏకంగా 1000 నాటుబాంబులు ఉండటమే. అవును, మీరు విన్నది నిజమే. ఇటీవల పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన

- మిగతా 2వ పేజీలో..

# ఎస్సీ,ఎస్టీలకు మాదిరి దివ్యాంగులకు రక్షణ

మొదటి పేజీ తరువాయి

కోర్టుపేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు.రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు నేడు విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సుర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే.. ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని.. వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

# రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన

మొదటి పేజీ తరువాయి

వారిని కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీపీకి లేఖ రాయగా రాత్రికి రాత్రే మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌లు టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి సురేఖ ఇంటికి పంపించిన విషయం వాస్తవం కాదా ఆయన ప్రశ్నించారు. అయినప్పటికీ సుమంత్ ని అరెస్ట్ చేయలేదన్నారు. అలాంటప్పుడు చేయని నేరానికి అకారణంగా ఐదు రోజులు కర్ల రాజేశ్ పోలీసుల రిమాండ్‌లో ఉంటే ఈ నియోజకవర్గానికి బాధ్యత వహించే మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాయలేదని ఆయన విమర్శించారు. ఆర్టికల్ 21 ప్రకారం రాజేశ్‌ని ఎందుకు కాపాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పేదల జీవితాలు లాకప్‌లోనే తెల్లారుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని రాజేశ్‌ను పోలీసులు చిత్రహింసలు పెట్టారని అందువల్లే ఆయన మృతి చెందారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల ప్రాజెక్టును రాత్రికి రాత్రే రూ.50 కోట్లకు పెంచడం అవినీతి కాక మరేమిటన్నారు. ఏమాత్రం ప్రణాళిక లేకుండా కొడంగల్ నారాయణపేట ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించారని ఈ అంశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలో 8 మంది సజీవ సమాధి అయ్యారని, ఇందుకు మంత్రి ఉత్తమ్‌పై కేసు పెట్టలేదన్నారు. రాజేశ్‌కు నేర చరిత్ర లేదని అతనొక్కడే కుటుంబానికి ఆధారమని, త్వరలో ఇల్లు నిర్మాణం చేయిస్తానని తెలిపారు. న కుమారుడి ఆరోగ్యం బాగాలేదని రాజేశ్ తల్లి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తానని పోలీసుల ఎదుట నెత్తి నోరు బాదుకున్నప్పటికీ పోలీసులు వినలేదని, నాణ్యమైన వైద్యం అందించకుండా చంపారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను అప్రూవర్‌గా తీసుకుని కేసును విచారించాల్సింది పోయి ఏకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని జీవించే హక్కును కాపాడుతానని చెబుతుంటే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రతిరోజు ప్రజా పాలన ఇందిరమ్మ పాలన అంటూ పేదలను చంపుతున్నారని, జీవించే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్ల సాక్షిగా దళితులను బాగా చూసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో వాగ్దానం చేయించి ఈరోజు ప్రాణాలు తీస్తున్నారన్నారు. ,292 ఎకరాల భూమిని ఆగమేఘాల మీద పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం చేసి ఆ భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధికులకు కట్టబెట్టారన్నారు. కావాలనే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన పేద వర్గాల అధికారులను ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని పేర్కొన్నారు. బడుగు వర్గాల అధికారులపై ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తుంటే ఆ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు అడ్లూరి భట్టి, వివేక్, రాజనర్సింహ ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

మొదటి పేజీ తరువాయి

విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయగా, కీలక నిందితుడిగా ఉన్న మాజీ అధికారి రాధాకిషన్ రావును అరెస్టు చేశారు. 'బీఆర్ఎస్ సుప్రీం' ఆదేశాల మేరకే తాము పనిచేశామని రాధాకిషన్ రావు తన రిమాండ్ రిపోర్టులో పేర్కొనడం సంచలనం రేపింది. ఈ క్రమంలోనే కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన రాజశేఖర్ రెడ్డిని విచారించడం ద్వారా మరిన్ని వివరాలు రాబట్టాలని సిట్ భావిస్తోంది. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తులను కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ దర్యాప్తు ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# సిగాచీ ఫార్మా పేలుడు ఘటన చిన్నదా

మొదటి పేజీ తరువాయి

తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది సాధారణ ప్రమాదం కాదని, ఇంతటి ఘోరంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పడం దారుణమని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇప్పటికే 237 మంది సాక్షులను విచారించినా పురోగతి ఏది పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు" అని నిలదీసింది. ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయకపోగా, కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత లోపించరాదని, వేగంగా పూర్తి చేసి బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించింది.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

హైదరాబాద్,నవంబర్ 27: తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్




రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

మొదటి పేజీ తరువాయి

ఈ భేటీలో చర్చించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు.కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకునే సమయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమ్మిట్‌లో సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు తదితర విభాగాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్లీనరీలో విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి ఈవెంట్ బాధ్యతను ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 2,600 మందిని



సమ్మిట్‌కు ఆహ్వానించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

# అబద్ధాలకు అంబాసిడర్ కెటిఆర్

మొదటి పేజీ తరువాయి

విశ్వసించరని తెలిపారు. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మే–రకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందుకోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# యువత వల్లే స్టార్టప్ విప్లవం

మొదటి పేజీ తరువాయి

ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్–టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ బస్సులో నాటుబాంబులు

మొదటి పేజీ తరువాయి

నాటుబాంబుల పేలుడు ఘటన, ఆర్టీసీ కార్గో సేవల్లోని భద్రతా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. బస్సులో వచ్చిన పార్శిల్‌ను దించే క్రమంలో జరిగిన ఈ పేలుడులో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అసలు ఆ మూటలో ఏముందో తెలియకుండానే బస్సులో ఎక్కించేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ప్రయాణికులను చేరవేయడంతో పాటు, అదనపు ఆదాయం కోసం ఆర్టీసీ 2017లో కార్గో పార్శిల్) సేవలను ప్రారంభించింది. తక్కువ ధరకే వస్తువులను పంపించే వెసులుబాటు ఉండటంతో దీనికి మంచి ఆదరణ లభించింది. రోజురోజుకూ ఆదాయం రెట్టింపు అవుతోంది. విజయనగరం జోన్ పరిధిలోనే రోజుకు సుమారు 250 వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. దీని ద్వారా రోజుకు రూ.40 వేల వరకు, నెలకు రూ.12 లక్షల ఆదాయం సమకూరుతోంది. నిత్యం ఈ సేవలను ఆశ్రయించేవారు 40 మంది వరకు రెగ్యులర్ కస్టమర్లు ఉన్నారు. అయితే, ఆదాయంపై పెట్టిన శ్రద్ధ, భద్రతపై పెట్టకపోవడమే ఇప్పుడు కొంప ముంచుతోంది.ప్రస్తుతం ఆర్టీసీ కార్గో బుకింగ్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. బుకింగ్ కౌంటర్లలో స్కానర్ పరికరాలు లేవు. లోపల ఏ వస్తువు ఉందో సాంకేతికంగా గుర్తించే వ్యవస్థ లేదు. పార్శిల్ పైన ఒక పేరు రాసి ఉంటే, లోపల మరో వస్తువు ఉంటోంది. కేవలం బరువును మాత్రమే చూసి, డబ్బులు తీసుకుని రశీదు ఇచ్చేస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గంజాయి, గుట్కా, ఇప్పుడు ఏకంగా నాటుబాంబులు వంటి నిషేధిత వస్తువులను దర్జాగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు.ప్రైవేట్ కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఆర్టీసీలో ఛార్జీలు చాలా తక్కువ. పైగా ఆర్టీసీ బస్సులు మారుమూల గ్రామాల వరకు వెళ్తాయి. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ఏజెన్సీ సిబ్బందిలో తెలిసిన వారు ఉంటే చాలు, ఎలాంటి తనిఖీలు లేకుండానే అనుమానాస్పద వస్తువులను పంపించేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు మూట కట్టి తెచ్చిన వస్తువును యథాతథంగా బస్సు ఎక్కించేస్తున్నారు. అది ప్రయాణికుల పాలిట యమపాశంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, పర్యవేక్షణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. కార్గో విభాగానికి మూడు జిల్లాల పరిధిలో విజయనగరం జోన్) కేవలం ఒక్కరే సూపర్‌వైజర్ ఉన్నారు. డిపోల పరిధిలో డిపో మేనేజర్లు డీఎంలు) పర్యవేక్షించాల్సి ఉన్నా, పని ఒత్తిడి కారణంగా అది జరగడం లేదు. నిఘా కొరవడటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఈ పరిస్థితిపై విజయనగరం డిపో కమర్షియల్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ హెచ్. దివ్య స్పందించారు. స్కానర్లు వంటి ప్రత్యేక పరికరాలు కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. రూ.5 వేలు విలువ దాటిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లు అడుగుతున్నామని, ఇకపై అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

# 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

మొదటి పేజీ తరువాయి

నియామకాలు రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పును ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును పిటిషనర్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది.గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సీజే ధర్మాసనం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. 2019 అక్టోబర్ 24న చేపట్టిన గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ 2 జవాబు పత్రాల్లో వైట్ నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ చేసిన పార్ట్ బీ పత్రాలను మూల్యాంకనం చేయడం చెల్లదని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్యాంపరింగ్ జరిగినట్లు స్పష్టంగా కనిపించినప్పటికీ వాటిని పక్కన పెట్టకుండా మూల్యాంకనం చేయడం చెల్లదని స్పష్టం చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా చేసిన మూల్యాంకనం ఆధారంగా చేపట్టిన నియామకాలు చెల్లవని రద్దు చేస్తూ మరోసారి మూల్యాంకనం చేసి అర్హుల జాబితాను విడుదల చేయాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా 8 వారాల్లో ముగియాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ అప్పీలు దాఖలు చేశారు.కాగా ఈ అప్పీలు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు సరిగ్గా లేవని దీనివల్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తుందని వాదించారు. డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అన్నీ పరిగణలోకి తీసుకొని టీజీపీఎస్సీ నియామక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2019లో ఎంపికైన అభ్యర్థులు ఇప్పుడు వివిధ హోదాల్లో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల వల్ల వాళ్లందరికీ నష్టం జరుగుతుందన్నారు. అప్పీలుపై వాదనలు విన్న సీజే ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ జారీ చేశారు. 2016లో మరికొన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చారు. వివిధ కేటగిరీల కింద మొత్తం 1,032 పోస్టులకు 2016 నవంబరులో పరీక్షలు నిర్వహించారు. కొంత మంది అభ్యర్థులు వైట్‌నర్ ఉపయోగించారని మరికొంత డబుల్ బబ్లింగ్ చేశారని 2017లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. సాంకేతిక కమిటీ హైకోర్టుకు కొన్ని సూచనలు సమర్పించింది. దాని ప్రకారం ఓఎంఆర్ షీట్ లోని పార్ట్ ఏ లో వ్యక్తిగత వివరాలు, బుక్ లెట్ నెంబరుకు సంబంధించి చెరిపివేతలున్నా సమస్య కాదని తెలిపింది.పార్ట్ బీలో 150 ప్రశ్నల విషయంలో వైట్‌నర్ వాడినట్లు గుర్తిస్తే ఆ జవాబులను పరిగణలోకి తీసుకోవద్దని సాంకేతిక కమిటీ సూచించింది. దీని ఆధారంగా మూల్యాంకనం చేసి 2019 అక్టోబరులో అర్హుల జాబితా ప్రకటించి నియామకపత్రాలిచ్చారు. ట్యాంపరింగ్ జరిగినా మూల్యాంకనం చేసి అర్హులను ఎంపిక చేశారంటూ మళ్లీ 6 పిటిషన్లు దాఖలయ్యాయి.



## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

### సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ దిమ్మతిరగాలి

### మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి పిలుపు

నిజామాబాద్,నవంబర్27: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే 29న నిర్వహించే దీక్షా దివస్' ను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికార పార్టీ తంటాలు పడుతోందని, బీసీ రిజర్వేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 42 శాతం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ బీసీలకు ద్రోహం చేయడమేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక, ఎన్నికలకు వెళ్లే ధైర్యంలేక న్యాయస్థానం చెప్పేవరకు చేసుకుందని విమర్శించారు. అందుకే పార్టీ గుర్తులు లేని పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని, ఎవరు గెలిచినా తమవాళ్లే అని చెప్పుకోవడం కోసం ఈ తతంగం చేస్తోందని ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీకి మంచి పట్టుందని, స్థానిక ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలొచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని తేల్చిచెప్పారు. 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన మోసపు హామీలను అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా లారీకి 1.5 క్వింటాలు కోతలు పెట్టి వేధిస్తున్నారన్నారు. కేసీఆర్ 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారని, రేవంత్ ప్రభుత్వం మాత్రం సంఘబంధ సభ్యులకే చీరెలు పంపిణీ చేస్తుండడంతో హహిళలు గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు కాలయాపన చేయడంతో గ్రామాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్వేలో బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తేలిందన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించు కోవాలని పేర్కొన్నారు.

## ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

### డ్రగ్ కార్టెల్‌లో ఉన్న 50మంది నైజీరియన్ల అరెస్ట్

హైదరాబాద్,నవంబర్ 27: దేశరాజధాని ఢిల్లీ తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టి డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్న 50 నైజీరియన్లను పట్టుకుంది. వీరంతా వీసా గడువు ముగిసినా మనదేశంలో తిష్టవేసి కూర్చుకున్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తున్న ఈగల్ పోలీసులు ఈ భారీ ఆపరేషన్లు పూర్తి చేశారు. దిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో దిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగిల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమ సత్తా చాటుదాం

### దీక్షా దివస్‌తో రేవంత్‌కు బుద్ధి చెబుదాం

### మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు


నిజామాబాద్,నవంబర్27: తెలంగాణ రాష్ట్రం ఉనికిలో ఉన్నదని అంటే అది 29 నవంవర్ 2009 నాడు కేసీఆర్ చేసిన దీక్ష ఫలితమేనని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగలా గణెలిష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ విజిగౌడ్, అయేషా,జిల్లా నాయకులు నూడా ప్రభాకర్, సిర్ప రాజు, సత్య ప్రకాష్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ... తనకున్న అన్ని పదవులను త్యాగం చేసి ,14 ఏండ్లు సుదీర్ఘ పోరటము చేసి చివరకు చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి భంగం కలిగించే విధంగా ఆంధ్ర పెత్తందారిల మోచేతి నీళ్లు త్రాగుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మంట కలిపే విధంగా రేవంత్ రెడ్డి పరిపాలన సాగుతున్నదని మండిపడ్డారు. 20 సంవత్సరాలుగా తెలంగాణ సమాజం యావత్తు దేవత గా పూజించినటువంటి తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం,తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మ ను మాయం చేయడం, తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన తెలంగాణ అమ-రవీరులను స్మరించుకొనేందుకు కేసీఆర్ కట్టించిన తెలంగాణ అమరుల స్మారక జ్యోతి ప్రాంగణానికి తాళం వేయడం వంటివన్నీ రేవంత్ దుష్టపాలనకు నిదర్శనమని అన్నారు. గోదావరి మరియు కృష్ణలో మన నీళ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దొంగలించుకపోతుంటే మన నీళ్ల కోసం మనం కొట్లాడే సందర్భంలో చంద్రబాబు నాయుడు దగ్గర బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ సెక్రటరీ గా పని చేసిన ఆదిత్యానాతన్ అనే ఐఏఎస్ ఆఫీసర్ ని ఇప్పుడు మన తెలంగాణ ఇరిగేషన్ శాఖ కు సలహాదారుడిగా నియమించడం లాంటి ఎన్నో రేవంత్ రెడ్డి నిర్ణయాలు తెలంగాణ ఆస్థిత్వానికి ఉనికికి భంగం కలిగించేవే అన్నారు. అందుకే తెలంగాణ ఆస్థిత్వాన్ని తెలంగాణ ఉనికిని కాపాడుకోవడం కోసం తిరిగి మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తితో పోరాడవలసిన సందర్భం ఇదని అన్నారు. ఇప్పుడు తెలంగాణ సమాజంలో మళ్ళీ ఆ ఉద్యమ స్ఫూర్తిని రగిలించడానికి తెలంగాణ ఉద్యమ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినటువంటి కేసీఆర్దీక్ష ను తెలంగాణ సమాజానికి మళ్ళీ ఒకసారి గుర్తు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

# మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి

### నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్లు షురూ!

### మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

హైదరాబాద్,నవంబర్27: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తొలి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత డిసెంబర్ 17న జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ పంచాయతీ ఎన్నికలు 12,760 గ్రామ పంచాయతీలు, 1,13,534 వార్డులకు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో పలు చోట్ల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.తొలి దశ నామినేషన్లు వేస్తున్నారు అభ్యర్థులు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 555 పంచాయతీలు, 4952 వార్డు స్థానాలకు మొదటి విడత ఎన్నికలు జరగుతున్నాయి. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. వరంగల్ 91 పంచాయతీలు, 800ల వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా 69 పంచాయతీలు , 658 వార్డు స్థానాలు, మహబూబాబాద్ జిల్లా 155 పంచాయతీలు, 1338 వార్డు స్థానాలు, జనగామ జిల్లా 110 పంచాయతీలు,1024 వార్డు స్థానాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా 82 పంచాయతీలు, 712 వార్డు స్థానాలు, ములుగు జిల్లా 48 పంచాయతీలు, 420 వార్డు స్థానాలకు గానూ ఎన్నికలు జరగుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి విడతలో 630 గ్రామ పంచాయతీలు, 5,598 వార్డులకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు. నల్గొండ జిల్లాలో నల్గొండ, చండూరు రెవెన్యూ డివిజన్లలోని 318 గ్రామ పంచాయతీలు, 2,870 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి రెవెన్యూ డివిజన్లలోని 159 గ్రామ పంచాయతీలు, 1,442 వార్డులకు నామినేషన్లు జరుగుతోంది. యాదాద్రి - భువనగిరి జిల్లాలో భువనగిరి రెవెన్యూ డివిజన్‌లోని 153 గ్రామ పంచాయతీలు, 1,286 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో... తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. ఆదిలాబాద్ జిల్లాలో 166, మంచిర్యాల జిల్లాలో 90, నిర్మల్ జిల్లాలో 136, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 114 సర్పంచ్, వార్డు స్థానాలకు తొలివిడత ఎన్నికలు జరుగుతోంది. అయితే, హైకోర్టు ఆదేశాల కారణంగా ములుగు, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోని 32 పంచాయతీలకు ఎన్నికలు జరగవు. తొలి విడతకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలవ్వడంతో.. ఈ దశలో 189 మండలాల్లో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు పూర్తి చేయాలని ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. తొలి విడతకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. తొలి విడత నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ నవంబర్ 29. ఆ తర్వాత నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహారణకు డిసెంబర్ 3 వరకు అవకాశం ఉంది. డిసెంబర్ 11న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ ఎన్నికల కోసం గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరుగుతుంది. నోటా (నాన్ ఆఫ్ ది అబౌవ్) ఆప్షన్ కూడా ఉంటుంది.పోలింగ్ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు లేదా తదుపరి రోజు పూర్తి అవుతుంది. మొత్తం 31 జిల్లాల్లో 545 మండలాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ల సంఖ్య 1.66 కోట్లు, వీరిలో మహిళలు 85.12 లక్షలు, పురుషులు 81.42 లక్షలు ఉన్నారు. రిజర్వేషన్ల పట్ల వివాదాలు ఉన్నప్పటికీ, బీసీలకు 17.08 శాతం (2,176 పంచాయతీలు) కేటాయించారు.




దీనిపై బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కీలకం. గత 20 నెలలుగా ప్రత్యేక అధికారులు పరిపాలన చేస్తున్నారు. ఇప్పుడు కొత్త నాయకులు ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఎస్ఈసీ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ (9240021456) ఉంది. మొబైల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఈ ఎన్నికలతో గ్రామాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారు. మొత్తం ప్రక్రియ డిసెంబర్ 17తో ముగుస్తుంది. ఓటర్లు తమ హక్కును వాడుకోవాలని ఎస్ఈసీ పిలుపునిచ్చింది.

## కుంభకోణానికి ఆస్కారమే లేదు

### ఇండస్ట్రీయల్ పాలసీప దుష్ప్రచారం

### పొల్యూషన్ ఫ్రీగా చేయడమే లక్ష్యం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,నవంబర్27 : ఇండస్ట్రీయల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు . బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రీయల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రీయల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రీయల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది.. అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

## బతుకమ్మకుంట వ్యవహారం

### హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

### డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 27: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే ఇప్పటికే ఇక్కడ సుందరీకరణ పనులు సాగాయి. పూర్వవైభవం తీసుకుని వచ్చారు. ఇటీవల సిఎం రేవంత్ తదితరులు కలిసి ప్రారంభించారు.

## నల్లచెరువులో ఆక్రమణలను మేం తొలగించలేదు

### తొలగింపులపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా

హైదరాబాద్,నవంబర్27: కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద బుధవారం తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం... చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 176లో చెత్త సేకరించేవారు, స్క్రాప్ వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. చెరువు ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వారిని కోరగా, రెండు మూడు రోజుల క్రితమే వారు స్వచ్ఛందంగా తమ షెడ్లను తొలగించుకుని వెళ్లిపోయారు. అయితే, ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కొందరు కబ్జాదారులు.. సర్వే నంబర్ 180 పేరుతో ఇప్పుడు కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్నవారి నుంచి అద్దెలు వసూలు చేసిన వారే, ఇప్పుడు వారిని అడ్డం పెట్టుకుని భూమిని కొట్టేయాలని చూస్తున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించి, సర్వే నంబర్ 180 కింద తమకు నష్టపరిహారం కావాలని కోరారు. అయితే, తాము ఖాళీ చేయిస్తున్నది సర్వే నంబర్ 176 అని, చెరువులో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని హైడ్రా కోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. సర్వే నంబర్లను సరిచూసి, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

# ఉప్పల్ కురుమనగర్‌లో సీవరేజ్ ప్లాంట్

### ప్రభుత్వ నిర్ణయంపై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ఫైర్

### అవసరం లేని చోట ప్లాంట్ పెట్టడంపై ఆగ్రహం

### కాలనీ వాసులతో కలసి ఆందోళన కార్యక్రమం




హైదరాబాద్,నవంబర్27:ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు సంబంధంలేని ఎస్ టి పి ప్లాంట్‌ను ఉప్పల్ కురుమనగర్ లో పెట్టడాన్ని బిజెపి నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్. వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఇక్కడి ప్రజలకు ఏమి ఉపయోగమని నిలదీసారు. ఉప్పల్ హిల్స్, కురు నగర్‌లో ప్రభుత్వం తలపెట్టిన ఎస్ టి పి సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు వ్యతిరేకంగా ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం ఛలో కురుమ నగర్ కార్యక్రమం నిర్వహించారు. కురుమ నగర్, ఉప్పల్ హిల్స్, లక్ష్మి నగర్ ల ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ప్రజా ఆరోగ్యలతో ఆటలాడుతున్నారని ప్రభాకర్ మండిపడ్డారు. కురుమ నగర్‌లో కాలనీ వాసులతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వంతో నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. మురికి నీటిని శుద్ధి చేసి కాలువలు చెరువుల్లోకి పంపే విధంగా అనువైన స్థలాన్ని కేటాయించాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు కమిషన్ల కోసం కక్కుర్తి పడి సహజ సూత్రాలకు విరుద్ధంగా కురుమ నగర్ లో ప్లాంటును నిర్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. అవినీతిపరులైన అధికారుల కారణంగా ప్లాంట్ నిర్మాణ వ్యయం సైతం 20 కోట్ల అదనపు భారం పెరుగుతుందని ఆయన ఆరోపించారు. అధికారుల తీరును దుయ్యబడుతూ ఆయన కురుమ నగర్ ప్రజలను చైతన్యం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంటును వేరే చోటికి తరలించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. త్వరలో ఉన్నతాధికారులకు వాస్తవ విషయాలను వివరిస్తామని అయినప్పటికీ చర్యలు తీసుకొని పక్షంలో పోరాటానికి సిద్ధమవుతామని ప్రభాకర్ హెచ్చరించారు. ఉప్పల్ హిల్స్ లో ఎంపిక చేసిన స్థలం కింద చెరువు గాని పైన కాలువ గాను లేదని ఇది కేవలం ప్రాజెక్టు వ్యయం పెంచి తద్వారా కాంట్రాక్టుల ద్వారా డబ్బులు దండుకునే కార్యక్రమం తప్ప మరోటి కాదని పేర్కొన్నారు. ఎస్ టి పి స్థలాన్ని మాత్రమే మార్చాలని వేరేచోట ఈ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని అద్భుత రాజధానిగా నిర్మాణం

### భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను మరువలేం
### అమరావతిలో స్వామి ఆలయానికి చంద్రబాబు శంకుస్థాపన
### రెండుదశల్లో రూ.260 కోట్లతో నిర్మిస్తామని ప్రకటన

అమరావతి,నవంబర్27: దేవతల రాజధాని అమరావతి అయితే... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మనం నిర్మించుకుంటున్న రాజధాని అంతలా ఉంటుందని అన్నారు. అన్ని అడ్డంకులు అధిగమించి ముందుకు సాగుతున్నామని అన్నారు. రాజధానిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం చంద్రబాబు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ఓం నమో వేంకటేశాయ అంటూ సీఎం చంద్రబాబు ఉపన్యాసాన్ని ప్రారంభించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఈ యుగంలో ఏపీలో అవతరించారన్నారు. 2019లో ఆలయాన్ని నిర్మించాలని సంకల్పం చేశామని గుర్తుచేశారు.



ఈ ప్రాంతానికి పేరు పెట్టినప్పుడే వేంకటేశ్వర స్వామి తన ద్వారా సంకల్పించారని తెలిపారు. ఇక్కడి రైతాంగం 29 వేల మంది 33,000 ఎకరాల భూమిని స్వచ్ఛందం గా ఇచ్చారని.. వారిని అభినందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. వారికి ఆ సంకల్పాన్ని వేంకటేశ్వర స్వామి కల్పించారన్నారు. కృష్ణానది తీరాన పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మితమైందని తెలిపారు. 1983లో తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. 2003లో ప్రాణదానం కార్యక్రమాన్ని స్విమ్స్‌లో ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మా ఇంటి దైవం వేంకటేశ్వర స్వామి... మా ఇంటి నుంచి చూస్తే ఆయన నామాలు కనిపిస్తాయి' అని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ కూడా వేంకటేశ్వర స్వామికి అప్రతిష్ట పాలు తెచ్చే పనిని చెయ్యనని.... ఎవరినీ చేయనివ్వనని స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి వద్దకు ఎప్పుడు వెళ్ళినా క్యూ లైన్‌లోనే వెళతానని తెలిపారు. ముఖ్యమంత్రిగా కాదు... భక్తుడిగా వెళతానని సీఎం అన్నారు. కొందరు తప్పులు చేస్తారని.. తప్పు చేసిన వారికి ఇంకో జన్మలో శిక్ష ఉంటుందను కుంటారని.. అయితే తప్పు చేస్తే మాత్రం వేంకటేశ్వర స్వామి ఈ జన్మలోనే శిక్షిస్తారన్నారు. గడచిన ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన పరిస్థితులు లేవని విమర్శించారు. ఐదేళ్లు ఇక్కడ రైతులకు నరకాన్ని చూపించారన్నారు. వేంకటేశ్వర స్వామిని రైతులు నమ్మకున్నారని.. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన ఈ ప్రాంత రైతులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ దేవాలయాన్ని రూ.260 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. తిరుపతి ప్రాంగణం తరహాలోనే ఇక్కడ గుడిని నిర్మిస్తామని.. రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. దేవాలయాల నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, ఆనందం, సంపద ప్రతి ఒక్కరికి అందించాలని వేంకటేశ్వర స్వామి ప్రార్థిస్తున్నానని అన్నారు. దేవతల రాజధాని అమరావతి నమూనాగా ఈ అమరావతి ఉండాలని వేంకటేశ్వర స్వామిని కోరుతున్నట్లు తెలిపారు. రెండు దశల్లో రూ.260 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు జరుగనున్నాయి. ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణం జరుగనుంది. మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. మొదటి దశలో రూ.140 కోట్లు వ్యయంతో వివిధ పనులు నిర్వహించనున్నారు. రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ మహాప్రాకారం నిర్మాణం జరుగనుంది. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్‌ల నిర్మించనుండగా.. వీటి నిర్మాణాలకు రూ.48 కోట్లు ఖర్చు చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి నారాయణ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు. ఇందులో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మిస్తారు. 201419 మధ్య తెదేపా ప్రభుత్వం శ్రీవారి ఆలయాన్ని రూ.185 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. దానిని రూ.36 కోట్లకు కుదించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి.. ఆలయాన్ని 201419 నాటి ప్రణాళికను మించి సకల హంగులతో అభివృద్ధి చేసేందుకు అడుగు ముందుకేసింది.





## రైతులపై మొసలి కన్నీరు ఆపండి

### మీ ఐదేళ్ల పాలనలో ఎలా ఉండేదో తెలుసు
### రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాం
### 24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నాం
### వైసిపి నేతల విమర్శలను తిప్పికొట్టిన మంత్రి నాదెండ్ల



విజయవాడ,నవంబర్ 27: ఐదేళ్ల పాటు రైతులను కనీసంగా కూడా పట్టించుకోని వైకాపా ఇప్పుడు రైతుల గురించి మొసలి కన్నీరు కార్చడం వింతగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ధాన్యం సేకరణ మొదలు, వారికి వివిధ రకాల సాయం అందించడంలో గత ఐదేళ్లలో ఎలా ఉండేదో రైతులే చెబుతారని అన్నారు. రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంట్యూ÷ర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బ తీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 202223 ఖరీఫ్‌లో కేవలం 13వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 202324లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు. మూడు నెలల్లో జరగాల్సిన పక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు.

## శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

### తుఫాన్‌కు దిత్వాహ్‌గా నామకరణం
### మత్స్యకారులను అప్రమత్తం చేసిన అధికారులు
### ఎపిలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక

విశాఖపట్నం,నవంబర్ 27: నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడుపుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులుతోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను శ్రీలంక ట్రింకోమలీకి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి



భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.

## ఐపిఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్ మరో ఆరు నెలలు పొడిగింపు

అమరావతి,నవంబర్27:సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన సస్పెన్షన్‌ను మరో ఆరు నెలల పాటు పొడిగించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. దీంతో వచ్చే ఏడాది మే నెలాఖరు వరకు సంజయ్‌పై సస్పెన్షన్ విధించినట్లు అయింది. సంజయ్ సస్పెన్షన్‌కు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు నవంబర్ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.÷ర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ ఎన్ సంజయ్ పని చేశారు. ఆ సమయంలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందింది. దాంతో ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ కొద్ది రోజులకే సంజయ్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ కేసులో అరెస్టయిన సంజయ్.. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

## ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అక్రమ దందాలు

### ఏకకాలంలో ఇడి అధికారుల దాడులు

అమరావతి,నవంబర్27:మెడికల్ కాలేజీల్లో అవినీతి, అక్రమాలు భారీ ఎత్తున చోటు చేసుకుంటున్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలపై ఈడీ అధికారులు గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. గతంలో కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) పీజీ సీట్లు కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో ఇటీవల మెడికల్ కౌన్సిల్ సభ్యులతోపాటు మెడికల్ కాలేజీల ప్రతినిధులను సీబీఐ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. అనంతరం తాజాగా ఈడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఈ దాడులు నిర్వహించారు. మరో వైపు దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో సోదాలను ఈడీ అధికారులు చేపట్టారు. ఏపీ, తెలంగాణతో సహా 10 రాష్ట్టాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

## మతం కంటే మానవత్వమే గొప్పది

### మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు
### ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
### మంగళగిరిలో మసీద్‌ను ప్రారంభించిన మంత్రి

అమరావతి,నవంబర్27: మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జిద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మాక్ అసెంబ్లీతో కనువిప్పు కావాలి

### జగన్‌కు యనమల చురకలు

అమరావతి,నవంబర్27: విద్యార్థుల మాక్ అసెంబ్లీ జగన్‌కు కనువిప్పు కావాలని మాజీ స్పీకర్, టిడిపి నేత యనమల రామకృష్ణుడు అన్నారు. సభలో ప్రతిపక్షం ఎలా వ్యవహరించిందో చూసైనా వైకాపా అధినేత జగన్ నేర్చుకోవాలని యనమల రామకృష్ణుడు హితవు పలికారు. చిన్న పిల్లలైనా ఎలాంటి తాత్కాలిక, శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా, ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కనీసం ఇప్పటికైనా జగన్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. సభ వెలుపల మాట్లాడటం కంటే, ప్రజాప్రతినిధిగా సభలో హాజరై చర్చించడం ముఖ్యమని ఇప్పటికైనా తెలుసుకోవాలని సూచించారు. లేదంటే త్వరలోనే అర్హత కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బుధవారం అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి సభ నడిపిన విషయం తెలిసిందే.



## ఇండోనేసియాలో భూకంపం

**ఇండోనేసియా :** ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం ఆషే ప్రావిన్స్‌కు సమీపంలో భూ ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతున నమోదైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే కొండచరియలు, ఆకస్మిక వరదలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ఆ దేశాన్ని ఈ ప్రకృతి విపత్తు వణికించింది. సైక్లోన్ సెన్యార్ కారణంగా సుమిత్రా దీవుల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. దాంతో ఇప్పటివరకు 28 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజల ఆచూకీ లభ్యమైంది. ఈ వరదల వల్ల బ్రిడ్జ్ కూలిపోవడంతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయి. దాంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వెల్లడించారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌కు సమీపంలో ఉండే ఇండోనేసియా తరచూ భూకంపాలు, సునామీ వంటి విపత్తులను ఎదుర్కొంటోంది. ఈ రింగ్ అనేది పసిఫిక్ మహాసముద్ర తీరం వెంట విస్తరించి ఉన్న భారీ టెక్టోనిక్ బెల్ట్. ఇక్కడే 90శాతం భూకంపాలు సంభవిస్తుంటాయి. జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్, అలస్కాలోని అల్యూటియన్ ద్వీపాలు దీని పరిధిలోకి వస్తాయి.

## వైట్‌హౌస్ వద్ద కాల్పులు.. ఉగ్ర చర్యే

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**యూఎస్ :** అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో జరిగిన కాల్పులు ఉగ్రచర్యే అని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఈసందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఈ కాల్పులకు కారణమని పరోక్షంగా ట్రంప్ విమర్శలు చేశారు. దీనిపై తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. 'ఇది ఒక దారుణమైన దాడి. విద్వేషపూరితమైన ఉగ్రవాద చర్య. ఇది మొత్తం దేశంపై జరిగిన దాడి. మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన దీన్ని మేం ఖండిస్తున్నాం' అని ట్రంప్ అన్నారు.



కాల్పుల అనంతరం అదుపులోకి తీసుకున్న వ్యక్తి ఈ భూమి పైనే ప్రమాదకర ప్రాంతమైన అఫ్గానిస్థాన్‌కు చెందినవాడని పేర్కొన్నారు. అతడు జో బైడెన్ పరిపాలన సమయంలో యూఎస్‌లోకి ప్రవేశించాడన్నారు. ఈసందర్భంగా బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు అఫ్గాన్ నుంచి దేశంలోకి వచ్చిన వారందరినీ తిరిగి విచారించాల్సిన అవసరం ఉందన్నారు. శరణార్థులు తమ మనుగడకే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. కాల్పుల నేపథ్యంలో వాషింగ్టన్‌లో మరో 500 మంది నేషనల్ గార్డ్ దళాలను మోహరించాలని ఆదేశించినట్లు తెలిపారు. అధ్యక్ష భవనానికి అతి సమీపంలో జరిగిన ఈ కాల్పులతో అగ్రరాజ్యం ఉలిక్కిపడింది. కాల్పుల సమయంలో అదుపులోకి తీసుకున్న వ్యక్తి అఫ్గాన్ జాతీయుడని లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ధ్రువీకరించారు. అతడి పేరు రెహ్మానుల్లా లఖన్‌వాల్‌గా పేర్కొన్నారు. 2021లో అఫ్గాన్‌లకు అందించిన స్పెషల్ వీసాపై అగ్రరాజ్యానికి వచ్చినట్లు తెలిపారు. కాల్పుల్లో నిందితుడికి కూడా గాయాలవడంతో.. అతడిని ఆస్పత్రికి తరలించామన్నారు. అతడు ఒంటరిగానే ఈ దాడికి పాల్పడ్డాడని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

### అఫ్గాన్ల ఇమిగ్రేషన్ దరఖాస్తులు సస్పెండ్

ఇక, కాల్పుల నేపథ్యంలో యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ కీలక నిర్ణయం తీసుకుంది. అఫ్గాన్ల ఇమిగ్రేషన్ దరఖాస్తులను వెంటనే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. వాషింగ్టన్ డీసీ కాల్పుల ఘటనలో నిందితుడు అఫ్గాన్ వలసదారుడిగా తేలడంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. దేశం, అమెరికన్ల భద్రతే తమకు ప్రాధాన్యమని వెల్లడించింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే వైట్‌హౌస్ జోన్ పరిధిలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు నేషనల్ గార్డులు ప్రాణాలు కోల్పోయారని వెస్ట్ వర్జీనియా గవర్నర్ ప్రకటించారు. అయితే, నేషనల్ గార్డులు చనిపోలేదని తీవ్రంగా గాయపడ్డారని డైరెక్టర్ కాష్ పటేల్ పేర్కొన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ క్షేమం..

### మృతి వార్తలను ఖండించిన జైలు అధికారులు

**పాకిస్థాన్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ జైల్లోనే మృతి చెందారంటూ పెద్దఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆ వార్తలను జైలు అధికా రులు ఖండించారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, మంచి భోజనం అందిస్తున్నామని ఓ ప్రకట నలో స్పష్టం చేశారు. రావల్పిండి జైలు అధికారుల ప్రకటన ప్రకారం.. 'అడియా లా జైలు నుంచి ఇమ్రాన్‌ను తరలించారంటూ వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. ఆయన పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు. వైద్య సహాయం అందుతుంది. ఆయన మృతి చెందారంటూ జరుగుతున్న ప్రచారం నిరాధారమైనవి' అని పేర్కొన్నారు. పాక్ రక్షణ మంత్రి ఖవాజ్ ఆసిఫ్ కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. ఇమ్రాన్ బయట కంటే జైలులో సౌకర్యవంతంగా ఉన్నారన్నారు. ఫైవ్‌స్టార్ హొటళ్లలో కూడా లభించని మంచి ఆహారాన్ని అతడు పొందుతున్నారన్నారు. ఆయనకు జైలులో విలాసవంతమైన సౌకర్యాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్నారు. ఇమ్రాన్ జైలులోనే మరణించారంటూ నెట్టింట వదంతులు వచ్చాయి. బలూచిస్థాన్ విదేశాంగ శాఖ దీనిపై ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఊహాగానాలను మరింత పెంచింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని ఆ పోస్టులో రాసుకొచ్చింది. పలు మీడియా సంస్థల నుంచి దీనిపై వార్తలు రావడంతో.. ఆయన మద్దతుదారులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతివ్వాలని ఆయన సోదరీమణులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు తమపై విచక్షణారహితంగా ప్రవర్తించారని ఇమ్రాన్ సోదరీమణులు ఆరోపిం చారు. మాజీ ప్రధానిని కలిసేందుకు జైలు అధికారులు అనుమతివ్వ కపోవడంతో ఆయన మృతి వార్తలు మరింత ఊపందుకున్నాయి. తాజాగా ఈ వార్తలను జైలు అధికారులు ఖండించారు.



# ఆకాశహర్మ్యాల్లో మంటలు

## ఆరు దశాబ్దాల్లో ఇదే అతిపెద్ద అగ్ని ప్రమాదం

**హాంకాంగ్ :** హాంకాంగ్‌లోని ఓ హౌసింగ్ కాంప్లెక్స్‌లో గల ఆకాశహర్మ్యాల్లో మంటలు చెలరేగి 50 మందికి పైగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాల్లో ఇదే అతిపెద్ద అగ్ని ప్రమాదమని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భవంతుల కిటికీల వద్ద మరమ్మతుల కోసం ఉంచిన పాలిస్టరైన్ బోర్డుల వల్లే మంటల తీవ్రత పెరిగినట్లు తెలుస్తోంది. ఈ అగ్ని ప్రమాదానికి కచ్చితమైన కారణమేంటో ఇంకా తెలియరాలేదు. అయితే, మంటల వ్యాప్తి మాత్రం అసాధారణ రీతిలో చాలా వేగంగా ఉందని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. కిటికీల వద్ద బోర్డులు ఇందుకు కారణమై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మరమ్మతుల నేపథ్యంలో ఈ భవంతులకు ఉన్న కిటికీలకు పాలిస్టరైన్ బోర్డులను అమర్చారు. దీనికి మండే స్వభావం ఎక్కువగా ఉంటుంది. నిన్న అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే మంటలు ఈ బోర్డులకు అంటుకున్నాయని, దీంతో వేగంగా పలు అపార్ట్‌మెంట్‌లకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ బోర్డులను ఎందుకు ఏర్పాటుచేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా కొన్ని బ్లాక్‌లు మండుతూనే ఉన్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

### ఏడు టవర్లకు పాకిన మంటలు

ప్రమాదం జరిగిన హౌసింగ్ కాంప్లెక్స్‌ను 1983లో నిర్మించారు. ఇందులో మొత్తం 8 టవర్లు ఉన్నాయి. ఒక్కోటి 31 అంతస్తులతో ఉన్న ఎత్తైన కట్టడాలివి. అయితే, ఈ టవర్లన్నీ చాలా దగ్గర దగ్గరగా ఉన్నాయి. మొత్తం 1,984 ఫ్లాట్లు ఉండగా.. ఇందులో దాదాపు 4,600 మంది నివసిస్తున్నారని అధికారులు తెలిపారు. నిన్నటి ఘటనలో ఇందులోని 7 టవర్లకు మంటలు అంటుకున్నాయి. ప్రస్తుతం ఈ



భవన సముదాయాలకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ పనుల కోసం వెదురు బొంగులు, ఆకుపచ్చ రంగులో ఉండే నిర్మాణ మెష్‌ను ఏర్పాటుచేశారు. వీటివల్ల కూడా మంటల తీవ్రత పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇవి అగ్నినిరోధక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా, లేదా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో 40శాతానికి పైగా 65ఏళ్ల పైబడినే వారేనని తెలుస్తోంది. వీరు భవనం నిర్మించినప్పటి నుంచి ఇందులోనే ఉంటున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. "మరమ్మతుల పేరుతో ఏడాదికి పైగా అపార్ట్‌మెంట్ కిటికీలను సీల్ చేసే ఉంచారు. చాలా కిటికీల వద్ద సిగరెట్ పీకలు కన్పించాయి. వీటి గురించి అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. మరమ్మతుల సమయంలో కొన్ని ఫైర్ అలారమ్‌లను ఆపివేశారు. దీంతో ప్రమాదం జరిగినప్పుడు విషయం అందరికీ తెలియలేదు. ఇది ప్రమాదం కాదు. చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు" అని స్థానిక మహిళ ఒకరు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 55 మంది మృతిచెందగా.. ఇంకా 270 మందికి పైగా ఆచూకీ తెలియరాలేదు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ భవంతులు మంటల్లో కాలిపోతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

### 60 ఏళ్లలో అతిపెద్ద అగ్ని ప్రమాదం..

హాంకాంగ్‌లో ఈ స్థాయిలో అగ్నిప్రమాదం జరగడం 60 ఏళ్లలో ఇదే తొలిసారి. అంతకుముందు 1962లో షామ్ షుయ్ పో ప్రాంతంలో ఓ భవనంలో మంటలు చెలరేగి 44 మంది మృతి చెందారు. ఆ భవనంలో భారీగా బాణసంచాను నిల్వ ఉంచారు. దీంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు నాడు అధికారులు వెల్లడించారు. ఇక, 1996లో గార్లే బిల్డింగ్‌లో జరిగిన ప్రమాదంలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు.

## దక్షిణాఫ్రికాను వచ్చే ఏడాది జీ-20కి రానివ్వం : ట్రంప్

**వాషింగ్టన్ :** దక్షిణాఫ్రికాలో మైనార్టీలైన శ్వేతజాతి రైతులను చూస్తున్న తీరుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో ట్రంప్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఏడాది అమెరికాలో జరిగే జీ20 సదస్సు నుంచి దక్షిణాఫ్రికాను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. 2026 జీ20 శిఖరాగ్ర సదస్సు అమెరికాలోని మయామిలో జరగనుంది. దీనిలో దక్షిణాఫ్రికా పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆ దేశానికి రాయితీలను కూడా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆ దేశంలో జరిగిన సదస్సుల్లో పాల్గొన్న అమెరికా ప్రతినిధిపై వారు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. ట్రంప్ ప్రకటనపై దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా స్పందించారు. జీ20లో సభ్యుడిగా చురుకైన తమ పాత్రను కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల తమ దేశంలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశం.. అత్యంత విజయవంతమైన వాటిల్లో ఒకటిగా నిలిచిందన్నారు. సదస్సుకు హాజరైనవారే స్వయంగా ఈ ప్రశంసలు చేశారన్నారు. అధ్యక్షుడు ట్రంప్ సదస్సుకు హాజరుకానందున.. ఆయనకు అందించాల్సిన పత్రాలను తమ దేశంలోని అమెరికా రాయబార కార్యాలయ అధికారికి అప్పగించినట్లు రమఫోసా కార్యాలయం తెలిపింది. అమెరికాతో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తమ అధ్యక్షుడు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని వెల్లడించింది. అయినప్పటికీ ట్రంప్ తప్పుడు ప్రచారం చేస్తూ.. తమ దేశంపై శిక్షార్హమైన చర్యలు తీసుకుంటూనే ఉన్నారని మండిపడింది. కాగా.. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన జీ20 సదస్సుకు ఆయన హాజరుకాలేదు. అంతుకుముందు ఆయన ఓ ప్రసంగంలో మాట్లాడుతూ.. దక్షిణాఫ్రికాను జీ20 గ్రూప్ నుంచి తొలగించాలని, అక్కడ జరిగే సదస్సును బహిష్కరించాలన్నారు. ఆ దేశంలో ఇలాంటి సదస్సు జరగడం అవమానకరమని వ్యాఖ్యానించారు. అక్కడ తెల్లజాతి రైతులపై జరుగుతున్న హింస, ఆస్తుల స్వాధీనం, హత్యలు వంటి దారుణాలు ప్రపంచానికి తెలియాలన్నారు.



## డాక్టర్ షాహిన్ నా భార్య.. గర్ల్‌ఫ్రెండ్ కాదు

### ఉగ్ర డాక్టర్ ముజమ్మిల్ వెల్లడి

**న్యూఢిల్లీ :** ఢిల్లీ కారు బాంబు పేలుడు కేసులో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. నిందితురాలు డాక్టర్ షాహిన్ షహిద్ గర్ల్‌ఫ్రెండ్ కాదని, తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ విచారణలో భాగంగా వెల్లడించాడు. 2023లో తమ నిఖా జరిగిందని చెప్పాడు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశం అందుకు వేదికైందని తెలిపాడు. ఈ మేరకు దర్యాప్తు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2023లో ఆయుధాలు కొనేందుకు ముజమ్మిల్‌కు షాహిన్ రూ.6.5 లక్షలు ఇచ్చిందని, 2024లో బాంబర్ ఉమర్ నబీకి ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు కొనేందుకు రూ.3లక్షలు ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ క్రమంలో ముజమ్మిల్, షాహిన్ బంధం గురించి బయటకువచ్చింది. దీనిద్వారా షాహిన్‌కు జైషే మహమ్మద్ మాడ్యూల్‌తో ఉన్న సంబంధాలు వెల్లడవుతాయా..? అనే దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఆ మాడ్యూల్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమీకరించుకునేందుకు ఆమె రూ.27 లక్షలు-28 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. అయితే అది మతపరమైన విరాళమని ఆమె దర్యాప్తులో వెల్లడించినట్లు తెలుస్తోంది. జైషే మహిళా విభాగంలో షాహిన్ కీలక పాత్ర పోషిస్తోందని ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. భారత్ ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబం ఛిన్నాభిన్నమైంది. ఆ ఉగ్ర సంస్థకు చెందిన ప్రధాన కేంద్రం కూడా ధ్వంసమైంది. ఈ క్రమంలో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ జమాత్ ఉల్ మొమినాత్ విభాగానికి మసూద్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ విభాగంలో షాహిన్‌కు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. పాక్‌లోని ఉగ్రవాదుల నుంచి అందుతున్న ఆదేశాలతో భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి, వారి నియామకాలు చేపట్టడం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. కాగా.. నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు వెనక కుట్ర కోణాలను జాతీయ దర్యాప్తు సంస్థ విచారిస్తోంది. దానిలో భాగంగా ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేసింది.



## సీఎంగా సిద్ధరామయ్య ఐదేళ్లు పూర్తి చేసుకుంటారు : యతీంద్ర సిద్ధరామయ్య

**మైసూరు:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు వెల్లువెత్తుతున్న వేళ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రిపై ఎలాంటి ఆరోపణలు లేవని, ఆయన ఎటువంటి కుంభకోణాల్లో భాగం కాలేదని పేర్కొన్నారు. సిద్ధరామయ్య సుపరిపాలన అందిస్తున్నారని, ఎమ్మెల్యేల మద్దతు కూడా ఆయనకే ఉందని తెలిపారు. అయితే, సీఎం మార్పు డిమాండ్‌పై పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో యతీంద్ర వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. అధికార పంపిణీ గురించి తనకు తెలియదని, ఎవరూ తనతో చెప్పలేదని ఆయన అన్నారు. ఇచ్చిన మాటకు సీఎం సిద్ధరామయ్య కట్టుబడి ఉంటారన్నారు. కానీ, ఆయన అధిష్ఠానానికి ఇచ్చిన మాట ఏంటనేది మాత్రం తాను చెప్పలేనని, ఆ విషయాన్ని ముఖ్యమంత్రినే అడగాలని అన్నారు.



## ఆధార్ కార్డు పౌరసత్వానికి ప్రామాణికం కాదు

### సుప్రీంకోర్టు స్పష్టం కీలక వ్యాఖ్యలు

### చొరబాటుదారులకు ఆధార్ కార్డులపై ఆందోళన

న్యూఢిల్లీ,నవంబర్ 27(: ఆధార్ కార్డును పౌరసత్వానికి ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై ఆందోళన వ్యక్తంచేసింది. పౌరులు కానివారు ఆధార్ కలిగిఉంటే,వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా అంటూ ప్రశ్నించింది. అనేక రాష్ట్రాల్లో భారత ఎన్నికల సంఘం చేపట్టి సర్‌ను సవాలు చేస్తూ పిటిషన్స్ దాఖలు అయ్యాయి. దీనిపై బుధవారం విచారణను చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడి ధర్మానసం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, బంగాల్‌లో సర్ కసరత్తుపై ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. 'ఆధార్ అనేది సంక్షేమ పథకాలను పొందేందుకు రూపొందించిన చట్టబద్ధ పత్రం మాత్రమే. ఒక వ్యక్తికి రేషన్ ఇవ్వడం కోసం ఆధార్‌ను మంజూరు చేసినందుకు, వాళ్లన్ని తప్పసరిగా ఓటరుగా చేయాలా పక్క దేశానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే, అతడికి కూడా ఓటు హక్కు ఇవ్వాలా ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఈసీకి ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. కొంతమంది పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. సర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందని చెప్పారు. వారిలో అనేకమంది నిరక్షరాస్యులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక, తమిళనాడు, కేరళ, బంగాల్‌లో సర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఈసీని కోరింది. మరోవైపు, దిల్లీలో వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్నందున వర్చువల్ విధానంలో విచారణలను చేపట్టే యోచనలో సుప్రీంకోర్టు ఉంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ తాను అనారోగ్యానికి గురైన విషయాన్ని వెల్లడించారు. వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. ఉదయపు నడకకు వెళ్లినప్పుడు తీవ్ర కాలుష్యం కారణంగా తాను కూడా అస్వస్థతతకు గురయ్యానని సీజేఐ వెల్లడించారు. అరవై ఏళ్లకు పైబడిన న్యాయవాదులు వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. బార్ అసోసియేషన్ అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దశాబ్దానికిపైగా తీవ్ర అస్వస్థతకు గురై అచేతన స్థితిలో, స్పృహ లేకుండా ఉన్న 31ఏళ్ల యువకుడికి కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు సంబంధించి వైద్య మండలిని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోయిడా జిల్లా ఆస్పత్రికి జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం బుధవారం సూచనలు చేసింది. ఆ యువకుడి తండ్రి చేసిన కారుణ్య మరణం అభ్యర్థనపై వైద్యపరమైన అన్ని అంశాలను పరిశీలించి

# వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

## కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి



తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి-సోదరి-కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.

# ఎల్లమ్మ సినిమా చేయడం లేదు



సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన భోళా శంకర్. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం రివాల్వర్ రీటా. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న ఎల్లమ్మ సినిమా గురించి ప్రశ్నించాడు. ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను ఎల్లమ్మ సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. ఎల్లమ్మ చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# ఎట్టకేలకు హిట్ కొట్టిన రామ్ పోతినేని

రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆంధ్రకింగ్ తాలూకా.. ఈ సినిమా భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ పి. మహేశ్ బాబు ఈ సినిమాను తెరకెక్కించాడు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాడు. అలాగే రావు రమేష్, మురళీ శర్మ, రాజీవ్ కనకాలు, తులసి, సింధు తులానీ, రాహుల్ రామకృష్ణ, సత్య, వీటీవీ గణేష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇక ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు సినిమా పై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇక సినిమా బాగుందని.. చాలా కాలం తర్వాత రామ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు అంటున్నారు. రామ్ నటన సినిమాకే హైలైట్ అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఎట్టకేలకు రామ్ హిట్ కొట్టాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు ప్రేక్షకులు. మొత్తానికి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్ లోకి వచ్చాడు రామ్ పోతినేని.







# ఛాంపియన్ భారీ అంచనాలు

హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఛాంపియన్ నుంచి ఫస్ట్ సింగిల్ గిరా గిరా విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ తాళ్లపూడి చంద్రకళగా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . పెళ్లిసందడితో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ఛాంపియన్ భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఛాంపియన్ చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. గిర గిర గిరగింగిరా గిరే అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఈ సాంగ్‌కు స్వరాలు సమకూర్చగా, రామ్ మిరియాల తనదైన భిన్నమైన ఫోక్ స్టైల్‌తో పాటకు ప్రాణం పోశాడు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామీణ వాతావరణాన్ని అచ్చుగుద్దినట్టు ప్రతిబింబించింది.




# విజయ్ దేవరకొండ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది



విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో వస్తున్న వీడీ 14 సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో, 19వ శతాబ్దపు యదార్థ సంఘటనల ఆధారంగా ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాని తెరకెక్కిస్తున్నారు. ఇందులో రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తున్నట్లు సమాచారం. హాలీవుడ్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి వీడీ 14 అనే వర్కింగ్ టైటిల్ తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో తీస్తున్నారు. ఇందులో స్టార్ కాస్టింగ్, టెక్నిషియన్స్ భాగం అవుతున్నారు. రెండున్నరేళ్లపాటు ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ మీద వర్క్ చేసిన రాహుల్.. సైలెంట్ గా షూటింగ్ కానిచ్చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ కీలక సమాచారం బయటకు వచ్చింది. వీడీ 14 అనేది బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో రూపొందే పీరియాడిక్ యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. 19వ శతాబ్దంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ క్యారెక్టరైజేషన్, ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటాయని టాక్. ఇక ఈ సినిమాలో మమ్మీ విలన్ ఆర్నాల్డ్ వోస్లూ నటిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. కనే మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. విజయ్ దేవరకొండ సినిమాలో సౌత్ ఆఫ్రికన్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఆయన ఇప్పటికే వీడీ 14 షూటింగ్ లో జాయిన్ అయినట్లు తెలుస్తోంది. సెట్స్ లో తమిళ యాక్టర్ వినోద్ సాగర్, ఆర్నాల్డ్ కలిసి దిగిన ఓ ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దీంతో హాలీవుడ్ స్టార్ ఈ సినిమాలో నటిస్తున్నారనే విషయం కన్ఫార్మ్ అయింది. ఆయన ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారో అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగిపోయింది.

# ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది



సెలబ్రెటీల లైఫ్ లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్ కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్ ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్ పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్.శ్రుతిహాసన్ అందం పై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది.

# సారీ ఫ్యాన్స్.. క్షమించండి

## టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్

భారత క్రికెట్ అభిమానులకు టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ క్షమాపణలు చెప్పాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయామని, తమను మన్నించాలని కోరాడు. గౌహతి వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2–0తో సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలుపొందింది. వరుసగా రెండో ఏడాది టెస్ట్ సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. దాంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు ఆటగాళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ జట్టును నడిపించాడు. కానీ 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే ఏన్నడు లేని పరాజయాన్ని టీమిండియా చవిచూసింది. ఈ క్రమంలోనే అభిమానులకు క్షమాపణలు చెబుతూ రిషభ్ పంత్ సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పంచుకున్నాడు. 'గత రెండు వారాలుగా మేం సరిగ్గా ఆడలేదనేది నగ్న సత్యం. జట్టుగా.. వ్యక్తిగతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని, కోట్లాది మంది భారతీయుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావాలని కోరుకుంటాం. కానీ ఈ సారి మేం మీ అంచనాలను అందుకోలేకపోయాం. అందుకు మమ్మల్ని క్షమించండి. కానీ క్రీడల్లో ఓటమి ఎప్పుడూ జట్టుగా.. వ్యక్తిగతంగా గుణపాఠం నేర్పుతుంది. మరింత




మెరుగవ్వాలని విషయాన్ని సూచిస్తుంది. భారత్ దేశానికి ప్రాతినిథ్యం వహించడం మా జీవితాల్లోనే మాకు దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ జట్టు సామర్థ్యం ఏంటో మాకు తెలుసు. మేం మరింత కష్టపడుతాం. మా ఆటపై మరింత ఫోకస్ పెడ్తాం. వ్యక్తిగతంగా జట్టుగా నేలకు కొట్టిన బంతిలా తిరిగి వస్తాం. మీ అమితమైన మద్దతు, ప్రేమకు ధన్యవాదాలు. జైహింద్'అని పంత్ తన సుదీర్ఘ పోస్ట్‌లో పేర్కొన్నాడు. టెస్ట్ సిరీస్ కోల్పోయిన టీమిండియా.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతోంది. నవంబర్ 30న రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌తో కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా, సిరాజ్, శుభ్‌మన్ గిల్‌కు రెస్ట్ ఇచ్చారు. కేఎల్ రాహుల్ భారత జట్టును నడిపించనున్నాడు.




# లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాలతో ముగిశాయి. ఇంట్రాడేలో జీవనకాల గరిష్ఠాలకు చేరిన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సూచీలు లాభాల స్వీకరణతో అక్కడి నుంచి కిందకు దిగొచ్చాయి. చివరకు సెన్సెక్స్ 110 పాయింట్లు పెరిగి 85,720 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్ల స్వల్పలాభంతో 26,215 వద్ద ముగిసింది. ఉదయం 85,745 పాయింట్ల దగ్గర ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 86,055 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. లాభాల స్వీకరణతో ఓ దశలో నష్టాల్లోకి జారుకొని 85,473 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరింది. నిఫ్టీ 26,261 దగ్గర ప్రారంభమై.. 26,310 దగ్గర రికార్డు స్థాయిని అందుకుంది. ఓ దశలో నష్టాల్లోకి వెళ్లి 26,141 దగ్గర కనిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడ్డ వాటిలో ఉన్నాయి. మారుతీ, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ, టాటా స్టీల్, టీసీఎస్‌షేర్లు నష్టపోయిన జాబితాలో ఉన్నాయి.



# పెర్త్ పిచ్‌కు ఐసీసీ రేటింగ్

ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ఇటీవల పెర్త్ వేదికగా మొదటి టెస్ట్‌లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా కేవలం 132 పరుగులకే కుప్పకూలింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 164 పరుగులకు ఆలౌటైంది. 204 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ రెండు వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. అయితే ఈ మ్యాచ్ కేవలం రెండు రోజుల్లోనే ముగిసింది. ఈ టెస్ట్‌లో రికార్డు స్థాయిలో.. తొలి రోజు ఏకంగా 19 వికెట్లు నేలకూలాయి. దీంతో ఈ పిచ్‌కు ఐసీసీ నుంచి ఏ రేటింగ్ వస్తుందో అని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ.. ఐసీసీ పెర్త్ పిచ్‌కు 'వెరీ గుడ్ రేటింగ్' ఇచ్చింది. ఇదే అత్యుత్తమ రేటింగ్ కావడం గమనార్హం.

### ఈడెన్ గార్డెన్స్ పిచ్‌కు ఏం రేటింగ్ ఇస్తుందో?

అయితే టీమ్ఇండియా దక్షిణాఫ్రికా మధ్య కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మొదటి టెస్ట్ మూడు రోజుల్లో ముగిసింది. బంతి విపరీతంగా స్పిన్ అవడంతో బ్యాటర్లు పరుగులు తీయడానికి, వికెట్లు కాపాడుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా (55) ఒక్కడే ఓపిగ్గా పరుగులు చేసి, టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా 30 పరుగుల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఐసీసీ ఈడెన్ గార్డెన్స్ పిచ్‌కు ఏం రేటింగ్ ఇస్తుందో అని క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# 2027 వరల్డ్ కప్ వరకు గౌతమ్ గంభీరే కోచ్ : బీసీసీఐ వర్గాలు

టీమ్ఇండియా ఇంతకుముందు న్యూజిలాండ్ చేతుల్లో స్వదేశంలో వైట్‌వాష్‌కు గురైంది. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా పూర్తిగా చెరిగిపోకముందే.. తాజాగా దక్షిణాఫ్రికా చేతిలోనూ సొంతగడ్డపై 0–2 తేడాతో సిరీస్ కోల్పోయింది. గంభీర్ కోచ్‌గా వచ్చిన 16 నెలల కాలంలో టీమ్ఇండియా మూడు టెస్ట్ సిరీస్‌లు ఓడిపోయింది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాపై ఓటమి పాలైంది. ఇప్పటివరకు భారత జట్టు 19 టెస్ట్ మ్యాచ్‌లు ఆడితే కేవలం 7 మ్యాచుల్లోనే విజయం సాధించింది. ఏకంగా 10 టెస్టుల్లో పరాజయం పాలైంది. 2 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. గెలుపు శాతం కేవలం 36.82గా ఉంది. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. గువాహటి టెస్ట్ మ్యాచ్ అనంతరం మైదానంలోని పలువురు అభిమానులు సైతం గంభీర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. కానీ బీసీసీఐ మాత్రం కోచ్ గౌతమ్ గంభీర్‌కు మద్దతుగా నిలుస్తోంది! 'బీసీసీఐ తొందరపాటుగా ఏ నిర్ణయాలూ తీసుకోదు. ప్రస్తుతం టీమ్ఇండియా మార్పు దశలో ఉంది. వరల్డ్ కప్ సమీపిస్తున్న నేపథ్యంలో కోచ్ గౌతమ్ గంభీర్ విషయంలో ఇప్పటికిప్పుడు ఏ నిర్ణయమూ తీసుకోం. అతడి కాంట్రాక్ట్ 2027 వరల్డ్ కప్ వరకు ఉంది. బీసీసీఐ.. సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి ముందుకుసాగుతుంది. కానీ కోచ్ విషయంలో సంచలన నిర్ణయాలూ ఏమీ ఉండవు' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి తెలిపారు. బుధవారం గువాహటి టెస్ట్‌లో ఓటమి అనంతరం విలేకరుల సమావేశంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడాడు. కోచ్‌గా తన భవిష్యత్తు విషయంలో విలేకరుల నుంచి ఎదురైన ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు. 'ఆ విషయాన్ని బీసీసీఐ నిర్ణయిస్తుంది. ఇండియన్ క్రికెట్ ముఖ్యం. నేను కాదు. ఈ విషయాన్ని నేను టీమ్ఇండియా హెడ్ కోచ్‌గా నియమితమైన తర్వాత నిర్వహించిన మొదటి ప్రెస్‌మీట్‌లోనే చెప్పాను. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాను. యువ జట్టుతో ఇంగ్లాండ్‌లో సాధించిన ఫలితాలను మర్చిపోయిన జనం.. న్యూజిలాండ్ చేతిలో ఓటమి గురించే మాట్లాడతారు. నేను ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లోనూ జట్టును గెలిపించాను' అని గౌతమ్ గంభీర్ అన్నాడు.

# జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్

మహిళల ప్రీమియర్ లీగ్ జనవరి 9న ప్రారంభంకానుంది. ఈ మేరకు గురువారం బీసీసీఐ ప్రకటించింది. ఫిబ్రవరి ఐదు వరకు ఈ టోర్నీ కొనసాగనుంది. నవీ ముంబయి, వడోదరలో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయని వెల్లడించింది. అయితే దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం దిల్లీలో డబ్ల్యూపీఎల్ మెగా ఆక్షన్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఆ లీగ్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ ఈ తేదీలు, వేదికల గురించి వెల్లడించారు. మహిళల ప్రపంచకప్ ఫైనల్ జరిగిన నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో ఈ నాలుగో సీజన్ ప్రారంభంకానుంది. ఫైనల్ మ్యాచ్‌కు వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికకానుంది. గత సీజన్‌లో బెంగళూరు, లఖ్‌నవూ, ముంబయి, వడోదరలో ఈ మ్యాచ్‌లు జరిగాయి. ముంబయిలోని బ్రబోర్న్ స్టేడియంలో మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్ జరగ్గా.. దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి ముంబయి ఇండియన్స్ కప్ గెలిచింది. ఇప్పటివరకు జరిగిన మూడు సీజన్లలో ఆ జట్టే రెండుసార్లు విజేతగా నిలిచింది. సెకండ్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం




దక్కించుకుంది. ఇటీవల మహిళల వన్డే ప్రపంచ కప్‌ను భారత జట్టు గెలుచుకున్న విషయం తెలిసిందే. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో గెలుపొందింది. షఫాలీ వర్మ (87), దీప్తి శర్మ (58) బ్యాట్, బంతితో అదరగొట్టారు. దాంతో మహిళల క్రికెట్‌పై అందరి దృష్టి పడింది. ఇప్పుడు ఈ వేలంలో దీప్తి శర్మను యూపీవారియర్స్ రూ.3.20 కోట్లకు తన జట్టులోకి తీసుకుంది.

# వరల్డ్‌కప్ క్వీన్ దీప్తి శర్మ కోసం హైడ్రామా..

## ఏకంగా రూ.3.20కోట్లతో యూపీ వైపు..

మహిళల ప్రీమియర్ లీగ్ 2026 కోసం నిర్వహించిన మెగా వేలంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. భారత ఆల్‌రౌండర్, మహిళల ప్రపంచకప్ టోర్నీలో కీలకంగా వ్యవహరించిన దీప్తి శర్మ కోసం హైడ్రామా నడిచింది. తొలుత ఆమెను దక్కించుకునేందుకు దిల్లీ క్యాపిటల్స్ పోటీ పడగా.. 'ఆర్‌టీఎం' కార్డ్ ఉపయోగించి యూపీ ఏకంగా రూ.3.20 కోట్లతో ఆమెను జట్టులోకి తీసుకుంది. ఈ ఏడాది జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ జట్టుకు దీప్తి శర్మ కెప్టెన్‌గా వ్యవహరించింది. అయితే, మెగా వేలానికి ముందు ఈ జట్టు దీప్తిని రిటైన్ చేసుకోలేదు. దీంతో గురువారం జరిగిన వేలంలో తొలి సెట్‌లో దీప్తి శర్మను కనీస ధర రూ.50లక్షలకు తీసుకునేందుకు దిల్లీ క్యాపిటల్స్ ఆసక్తి చూపించింది. ఆ సమయంలో యూపీ వారియర్స్ 'రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం)' అవకాశాన్ని వినియోగించుకుంది. గతంలో ఒక జట్టుకు ఆడిన క్రీడాకారులను మళ్లీ వేలంలో దక్కించుకునేందుకు ఫ్రాంఛైజీలకు ఉండే సదుపాయం ఇది. ఇప్పుడు ఈ ఆర్‌టీఎం కార్డును యూపీ ఉపయోగించుకోగానే.. దిల్లీ ఫ్రాంఛైజీ తన బిడ్‌ను రూ.3.20 కోట్లకు పెంచేసింది. ఆ ధరకు యూపీ వారియర్స్ అంగీకరించడంతో దీప్తి శర్మ మళ్లీ పాత జట్టుకే వెళ్లిపోయింది. అంత మొత్తం వెచ్చించేందుకు యూపీ జట్టు వెనుకాడకపోవడంతో దిల్లీ క్యాంప్‌లో ఉన్న సౌరభ్ గంగూలీ ఆశ్చర్యపోయారు. ఈ ధరతో డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటివరకు రెండో అత్యధిక ధర కలిగిన క్రీడాకారిణిగా దీప్తి శర్మ నిలిచింది. గతంలో స్మృతి మంధానను బెంగళూరు జట్టు రూ.3.4కోట్లకు దక్కించుకుంది. ఇటీవల జరిగిన మహిళల ప్రపంచకప్ టోర్నీలో దీప్తి శర్మ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. అటు బ్యాట్‌తోనూ.. ఇటు బంతితోనూ అదరగొట్టి ఫైనల్ పోరులో టీమ్ఇండియాకు కప్పు అందించడంలో కీలక పాత్ర పోషించింది. 215 పరుగులు, 22 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచింది.



### ఇప్పటి వరకు ఎవరికి ఎంతంటే..?

- సోఫీ డివైన్ – రూ.2 కోట్లు (గుజరాత్ జెయింట్స్)
- దీప్తి శర్మ – రూ.3.20 కోట్లు (యూపీ వారియర్స్)
- అమెలియా కెర్ – రూ.3 కోట్లు (ముంబయి ఇండియన్స్)
- రేణుకా సింగ్ – రూ.60లక్షలు (గుజరాత్ జెయింట్స్)
- సోఫీ ఎకిల్‌స్టోన్ – రూ.85లక్షలు (యూపీ వారియర్స్) (ఆర్‌టీఎం)
- మెగ్ లానింగ్ – రూ.1.90 కోట్లు (యూపీ వారియర్స్)
- లారా వొల్వార్డ్ – రూ.1.10కోట్లు (దిల్లీ క్యాపిటల్స్)
- శ్రీ చరణి – రూ.1.30కోట్లు (దిల్లీ క్యాపిటల్స్)

# బ్యాటర్ల వైఫల్యం వల్లే భారత్ సిరీస్ కోల్పోయింది

## ఆ విషయం మూడు.. నాలుగేళ్లుగా చెబుతూనే ఉన్నా : రవిచంద్రన్ అశ్విన్

టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా చేతిలో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది. ఇలా జరగడం 25 ఏళ్లలో ఇదే తొలిసారి. గతంలో 2000 సంవత్సరంలో భారత జట్టు ఇలాగే సిరీస్ ఓటమిని మూట గట్టుకుంది. కోల్‌కతా టెస్ట్‌లో 30 పరుగుల తేడాతో ఓటమి చవిచూసిన టీమ్ఇండియా, గువాహటి టెస్ట్‌లో ఏకంగా 408 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. భారత జట్టుకు టెస్టుల్లో ఇదే అతిపెద్ద ఓటమి. ఇంతకుముందు మన జట్టు 2004లో నాగ్‌పూర్ వేదికగా ఆస్ట్రేలియా చేతిలో 342 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. బ్యాటర్ల వైఫల్యం వల్లే భారత్ స్వదేశంలో దక్షిణాఫ్రికాతో సిరీస్ కోల్పోయిందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వాపోయాడు. ముఖ్యంగా స్పిన్‌ను సమర్థమంతంగా ఎదుర్కోవడంలో బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. 'భారత ఆటగాళ్ల బ్యాటింగ్ పేలవంగా ఉంది. మన బ్యాటర్లు సరిగా స్వీప్ షాట్లు ఆడటం లేదని నేను 3, 4 సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నా. గత న్యూజిలాండ్ సిరీస్‌లో ఆ జట్టు బ్యాటర్లు చక్కగా స్వీప్ చేశారు. దాన్ని డిఫెన్స్‌గా వాడుకున్నారు. ఒక బాల్‌ను డిఫెండ్ చేస్తే.. మరో దాన్ని స్వీప్ షాట్ కొట్టారు. వాళ్లు స్వీప్ షాట్ల మీద చక్కగా కసరత్తు



చేశారు' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా విశ్లేషించాడు. 'దక్షిణాఫ్రికా స్పిన్నర్ సైమన్ హార్మర్ బౌలింగ్‌లో మన బ్యాటర్లు ఎంతమంది చక్కని డిఫెన్స్ ఆడారు? డిఫెన్స్ ఆడటంలో లోపాలుంటేనే షాట్లు ఆడటానికి ప్రయత్నిస్తారు. బిగ్ హిట్టింగ్ మా ఆట తీరని సాకులు చెబుతుంటారు. కానీ బ్యాటర్లు కచ్చితంగా డిఫెన్స్ ఆడాలి. గొప్ప ఆటగాళ్ల సామర్థ్యం వారు ఆడే డిఫెన్స్ వల్లే తెలుస్తుంది. ప్రస్తుత బ్యాటర్లు స్పిన్ ఆడలేకపోవడమే అతిపెద్ద సమస్య. టీమ్ఇండియా స్పిన్ ఆడటంలో అట్టడుగున ఉంది' అని అశ్విన్ పేర్కొన్నాడు.

# ప్రమాదవశాత్తు బాస్కెట్‌బాల్ ప్లేయర్ మృతి

హరియాణాలో విషాదం జరిగింది. ఆ రాష్ట్రానికి చెందిన హార్దిక్ (16) అనే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ప్రాక్టీస్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ బాస్కెట్‌బాల్ హూప్ పోల్ మీద పడడంతో కోర్టులోనే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 16 ఏళ్ల బాస్కెట్‌బాల్ ఆటగాడు హార్దిక్ లఖన్ మజ్రా గ్రామంలోని స్పోర్ట్స్ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ కోర్టులో ప్రాక్టీస్ చేసేందుకు వెళ్లాడు. ప్రాక్టీస్ సమయంలో బాస్కెట్‌బాల్ హూప్‌ను పట్టుకొని వేలాడుతుండగా, అకస్మాత్తుగా పోల్ విరిగి అతడి ఛాతిపై పడింది. దీంతో హార్దిక్ అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆ సమయంలో అక్కడే కోర్టులో ఉన్న ఇతర ప్లేయర్లు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే హార్దిక్ మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. స్కెట్‌బాల్‌లో అద్భుతమైన ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న హార్దిక్ భారత జట్టుకు ఎంపికయ్యాడు. అతను ఇటీవల భారత జట్టు శిబిరం నుంచి తిరిగి వచ్చి, రానున్న పోటీలకు సన్నద్ధమవుతున్నాడు. కానీ ఇంతలోనే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడు బాస్కెట్‌బాల్‌లో అద్భుతంగా రాణించి పేరు సంపాదిస్తాడనుకుంటే, విధి ఇలా చేసిందంటూ అతడి తల్లిదండ్రులు విలపించారు. కాగా, హార్దిక్‌కు ఒక తమ్ముడు ఉన్నాడు. అతను కూడా మంచి బాస్కెట్‌బాల్ ఆటగాడే కావడం విశేషం.కాగా, రెండు రోజుల కిందట అదే రాష్ట్రం జజ్జర్ జిల్లాలోని బహదూర్‌గఢ్‌లోని హొషియార్ సింగ్ స్పోర్ట్స్ స్టేడియంలో ఇలాంటి ఘటనే జరిగింది.



# సైబర్ మోసాల బారిన పడకుండా.. ఈ టిప్స్ పాటించండి

సైబర్ నేరాలు ప్రతియేటా పెరిగిపోతున్నాయి. కొత్త కొత్త పంథాల్లో సైబర్ నేరగాళ్లు ప్రజల నుంచి సొత్తును కొట్టేస్తున్నారు. ఒక్క 2024లోనే ఏకంగా రూ.22,845 కోట్లను కాజేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఈ గణాంకాలే చెబుతున్నాయి. ఆన్‌లైన్ మోసాల బారినపడకుండా ఉండేందుకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ కొన్ని సూచనలు చేసింది. ఆ వివరాలు ఇవీ..

- వినియోగదారులు బలమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోవాలి. కేపిటల్, స్మాల్ లెటర్స్, స్పెషల్ క్యారెక్టర్లను ఉపయోగించాలి. పాస్‌వర్డ్ కనీసం 12–16 అక్షరాలతో ఉండాలి. అన్ని ఖాతాలకూ ఒకే పాస్‌వర్డ్ కాకుండా ఒక్కో ఖాతాకు ఒక్కో పాస్‌వర్డ్ పెట్టుకోవాలి.
- కంప్యూటర్‌లోని ఆపరేటింగ్ సిస్టమ్, యాప్స్, సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల సిస్టమ్ హ్యాక్ అవకుండా సెక్యూరిటీ ప్యాచ్‌లు నియంత్రిస్తాయి. డేటా సురక్షితంగా ఉంటుంది.
- ప్రతి అకౌంట్‌కు 2- ఫ్యాక్టర్ అథెంటికేషన్ యాక్టివేట్ చేయండి. ఎస్సెమ్మెస్ ఆధారిత అథెంటికేషన్ ఓటీపీ, బయోమెట్రిక్ స్కాన్ వంటి 2–ఫ్యాక్టర్ అథెంటికేషన్ ద్వారా అకౌంట్‌ను మరింత సురక్షితంగా ఉంచొచ్చు.
- అనుమానాస్పద ఇ–మెయిల్స్‌కు దూరంగా ఉండండి. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఇ–మెయిల్స్, లింక్స్‌ను వెంటనే ఓపెన్ చేయొద్దు. అటాచ్‌మెంట్‌లు, ఏపీకేలు డౌన్‌లోడ్ చేసేముందు పంపినవారు నమ్మకమైన వారేనా అనేది ధ్రువీకరించుకోండి.
- పబ్లిక్ వై–ఫై నెట్‌వర్క్ వాడేటప్పుడు ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ లేదా షాపింగ్ వంటి కార్యకలాపాలు చేయొద్దు. అవసరమైతే వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్)ను ఉపయోగించండి. ఇది ఇంటర్నెట్ ట్రాఫిక్‌ను ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. తద్వారా మీ డేటా సురక్షితంగా ఉంటుంది.
- వెబ్‌సైట్‌లను ఉపయోగించే సమయంలో అడ్రస్ బార్‌లో హెచ్‌టీటీపీఎస్‌తో పాటు ప్యాడ్‌లాక్ సింబల్ ఉందా అనేది గమనించాలి. ఈ రెండూ సురక్షిత కనెక్షన్‌ను సూచిస్తాయి.
- ముఖ్యమైన ఫైళ్లు, డేటాను వినియోగదారులు ఎప్పటికప్పుడు ఎక్స్‌టర్నల్ డ్రైవ్‌కు లేదా క్లౌడ్ స్టోరేజీకి బ్యాకప్ పెట్టుకోవాలి.
- అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు మీ బ్యాంక్, క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి.
- విశ్వసనీయ యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను మీ డివైజ్‌లో ఇన్‌స్టాల్ చేసి తరచూ అప్‌డేట్ చేయండి. ఫైర్‌వాల్ ప్రొటెక్షన్‌ను యాక్టివేట్ చేసి ఉంచండి.

# రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు

**మరో తుఫాన్ ద్విత్వాహ్ దూసుకుని వస్తోంది. అంది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది. తుఫాన్లు వచ్చినప్పడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్కరైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు.తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది.**

రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌతోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది



నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశుసంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# సమస్యల మూలాలను గుర్తించాలి

**వాయు కాలుష్యం సమస్య ఢిల్లీ సతమతం**

**కాలుష్యం ప్రతి ఒక్కరిని వేధిస్తున్న అంశం**

**మాదగ్గర వద్ద 'మంత్రదండం' లేదు**

**సమస్యను తక్షణమే పరిష్కరించండి**

**ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ,నవంబర్ 27(: దేశ రాజధాని ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యం సమస్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వాయు కాలుష్యం సమస్య ఢిల్లీలో నివసిస్తున్న ప్రతి ఒక్కరిని వేధిస్తున్న అంశమని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీలో కాలుష్య దుస్థితి నేపథ్యంలో ఈ అంశంపై తక్షణమే విచారణ జరపాలని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించడానికి తమ వద్ద 'మంత్రదండం' లేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడానికి గల మూలాలను మొదటగా గుర్తించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఆ తర్వాతే పరిష్కారాలను కనుగొనగలమని అభిప్రాయపడ్డారు. కాలుష్యం అంశాన్ని విచారణకు స్వీకరిస్తాం. అయితే, దీనికి త్వరగా పరిష్కారాలు కనుగొనడానికి మా వద్ద మంత్రదండం లేదు. సమస్యలను గుర్తించి వాటికి అవసరమైన పరిష్కాలను కనుక్కోవాలి. ఈ సమస్యకు గల అన్ని కారణాలను గుర్తించాలి. కాలుష్యం సమస్యకు ఒక కారణం ఉండదు. బహుశా ప్రజలు ఒకే కారణం ఉండవచ్చని భావించవచ్చు. కానీ, కాలుష్యానికి అనేక కారణాలు దోహదం చేస్తాయి. ప్రతి కారణానికి పరిష్కారాలను శాస్త్రవేత్తలు మాత్రమే కనుక్కోగలరు. ప్రభుత్వం ఏదైనా పరిష్కారంతో ముందుకు వచ్చి ఉంటుందని మేము ఆశిస్తున్నాం. కాలుష్యంపై మేము సైతం నిరంతరం పర్యవేక్షణ చేపడుతాం. సోమవారం ఈ అంశంపై విచారణ చేపడుతామని అన్నారు. అంతకుముందు జస్టిస్ బీఆర్? గవాయ్ సీజేఐగా ఉన్నప్పుడు ఆయనతో




కూడిన ధర్మానసం వాయు కాలుష్య సమస్యపై విచారణ చేపట్టింది. రాజధాని పరిసర ప్రాంతాలను ఉద్దేశించి ప్రస్తావించింది. పంజాబ్?, హరియాణా, రాజస్థాన్ ప్రభుత్వాలు కాలుష్యాన్ని తగ్గించడానికి నివారణ చర్యలు చేపట్టాలని, క్రమం తప్పకుండా సమీక్ష?లు నిర్వహించాలని ఆదేశించింది. ఈ విషయాలను కోర్టులు కూడా తప్పకుండా పర్యవేక్షించాలని పేర్కొంది. కాలుష్యాన్ని అరికట్టడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచించింది. శీతాకాలంలో ఉత్తరాది రాష్ట్రాల్లో గాలి నాణ్యతను మరింత దిగజార్చే కారకాల్లో ఒకటైన పంట వ్యర్థాలు తగలబెట్టడం అరికట్టాలని తెలిపింది. అయితే ఈ విషయంపై పంజాబ్ , హరియాణాల నుంచి నివేదికలను కూడా అప్పట్లో న్యాయస్థానం కోరింది.మరోవైపు వాయు కాలుష్య సమస్యపై శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధమైన, పౌర ఆధారిత హరిత వ్యూహాన్ని రూపొందించాలని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని రాష్ట్రాలను ఆదేశించారు. ఢిల్లీ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పచ్చదనం పెంపు విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అటవీ భూమి, రక్షిత ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాలు, చిత్తడి నేలలు, క్షీణించిన అడవులు, నర్సరీల వంటి వాటిని పరిగణించాలని ఆదేశించారు.



# ఈవీఎంల తనిఖీపై ఫిర్యాదులందలేదు

**తనిఖీ చేయాలని ఎవరూ ఫిర్యాదు చేయలేదు**

**వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం**

న్యూఢిల్లీ,నవంబర్ 27(: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఇతర రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఈవీఎం మెమొరీ, మైక్రో కంట్రోలర్ కాలినట్లు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్‌లోని 243, పలు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులు ఎవరూ ఈవీఎంలు తనిఖీ చేయాలని అడగలేదని తెలిపింది. "ఇటీవల జరిగిన బిహార్ శాసనసభ ఎన్నికలు 2025 ఎన్నికలు, 8 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాలిపోయిన మెమరీ/మైక్రోకంట్రోలర్‌ను తనిఖీ చేయాలని ఏ అభ్యర్థి నుంచి దరఖాస్తు అందలేదు." అని ఈసీ పేర్కొంది.అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు %జుఎవీ%ల కాలిపోయిన మెమరీ/మైక్రోకంట్రోలర్ లెక్కింపు తర్వాత తనిఖీ, ధృవీకరణపై సవరించిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (%వాశీూ%) జూన్ 17న జారీ చేసినట్లు %జుజ×% తెలిపింది. దీని ప్రకారం ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు పోలైన అభ్యర్థి తర్వాతి స్థానాల్లో ఉన్న నంబర్ 2 లేదా నంబర్ 3 అభ్యర్థులు ఫలితం ప్రకటించిన ఏడు రోజుల్లోపు %జుఎవీ%లను తనిఖీ చేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఈసీ పలు విషయాలను తెలిపింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో (మొత్తం 1,215 పోలింగ్ కేంద్రాలు) %ఎవూూ% స్లిప్‌లను లెక్కించామని, ఎక్కడా %జుఎవీ% లెక్కింపుతో వ్యత్యాసం రాలేదని వివరించింది. బిహార్‌లోని 38 జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిన తర్వాత 12 గుర్తింపు పొందిన పార్టీలు లేదా ఓటర్ల నుంచి తొలగింపు, నమోదుపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని చెప్పింది. ఇంకా 2,616 మంది అభ్యర్థులు, 12 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల్లో ఎవరూ కూడా రీ పోలింగ్ నిర్వహించాలని కోరలేదని పేర్కొంది. బిహార్ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల్లోని 8 ఉపఎన్నికలు నిర్వహించిన 72 గంటల్లోనే ఇందుకు సంబంధించిన




వివరాలను అందుబాటులో ఉంచామని తెలిపింది. ఎన్నికల ముగిసిన ఐదు రోజుల్లోనే గణాంకాలతో సహా పూర్తి వివరాలను ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. కాగా, అంతకుముందు జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించింది. 243 స్థానాల్లో 202 సీట్లు గెలుచుకొని సత్తా చాటింది. 101 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 89 సీట్లు గెలుచుకుంది. అదే సంఖ్యలో పోటీ చేసిన జేడీయూ 85 స్థానాలు గెలిచి తక్కువ తేడాతో రెండో స్థానంలో నిలిచింది. ఫలితంగా బిహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ పదోసారి బాధ్యతలు చేపట్టారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ప్రజలకు తెలియని పార్టీలకు కూడా లక్షల ఓట్లు రావడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తమ బృందం సేకరించిన అభిప్రాయాలకు, వెలువడిన ఫలితాలకు పొంతనేలేదని అభిప్రాయపడ్డారు. అయితే దీన్ని నిరూపించేందుకు మాత్రం తన వద్ద ఆధారాలు లేవన్నారు. కానీ, ఎప్పటికైనా ఆధారాలు బయటకు వస్తాయని పీకే చెప్పారు.

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com; Corporate Office : H.No.: 1-10-216/A/15, Lane No 2, Brahminwada, Begumpet, Hyderabad - 500016, Telangana